నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 3 జూన్ 2025 HYDERABAD




## వచ్చే రెండ్రోజులు వర్షాలు

సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): సోమవారం నగరంలో పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. అల్లాపూర్, బాలానగర్, కూకట్‌పల్లి, నేరెడుమెట్, చర్లపల్లి, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో తేలికపాటి వాన కురిసింది. మరోవైపు ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 32.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 24.4డిగ్రీలు, గాలిలో తేమ 61శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా కిందిస్థాయి గాలుల ప్రభావంతో రాగల 2 రోజులు పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



పరేడ్‌గ్రౌండ్స్‌లో | తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా.. సోమవారం పరేడ్ గ్రౌండ్స్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

అయ్యో! హోటల్ ఫుడ్!!

# ధనార్జనే ధ్యేయం

## ఫుడ్డు నాసిరకం

**సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ) :** జిహ్వా చాపల్యాన్ని తట్టుకోలేక రెస్టారెంట్‌కు వెళ్లి తిందామనుకుంటున్నారా? అయితే మీ ఆరోగ్యం జాగ్రత్త. రుచికి పేరు మోసిన పెద్ద పెద్ద రెస్టారెంట్ల నుంచి ఫుట్‌పాత్‌లపై ఉన్న టిఫిన్ బండ్ల వరకు.. నాసిరకం సరుకులు వాడుతున్నారు. పాచిపోయిన ఫుడ్డే పెడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ బృందాల తనిఖీల్లో ప్రతిరోజూ వెల్లడవుతున్న కఠోర వాస్తవాలివి. ఒక రకంగా చెప్పాలంటే స్వచ్ఛమైన ఆహారాన్ని అందించే రెస్టారెంట్లు వేళ్లమీద లెక్కపెట్టేంత తక్కువ సంఖ్యలో ఉన్నాయి. నియమ, నిబంధనలను పక్కన పెట్టేసి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వంటగదుల్లో పరిశుభ్రత పాటించడం లేదు. వంట చేసే క్రమంలో కల్తీ సరుకులో లేక నాసిరకమో వాడుతున్నారు. కొన్ని రెస్టారెంట్లలో అయితే.. కస్టమర్ అడగగానే పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మసాలాలు దట్టించి వాడుతున్నారు. కొన్ని సార్లు బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వస్తున్న సందర్భాలు లేకపోలేదు. ఈ జాబితాలో చిన్న హోటళ్లు నుంచి బడా హోటళ్ల నిర్వాహకులు ఉంటున్నారు. తరచుగా జీహెచ్‌ఎంసీకి నిత్యం దాదాపు 20 వరకు పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి. ఇందులో భాగంగానే గడిచిన కొన్ని నెలలుగా ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లపై విస్తృత తనిఖీల్లో ఆహార కల్తీకి అడ్డు అదుపు లేకుండా పోతున్నదని, ఏ మాత్రం శుభ్రత, నాణ్యత లేదన్న విషయం వెల్లడవుతున్నది. గడిచిన ఏడాది కాలంలో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు 1887 నమూనాలను

మిగతా IIవ పేజీలో





- రెస్టారెంట్లు, హోటళ్లలో విచ్చలవిడిగా నాణ్యత లోపం
- అదే బాటలో కాలేజీ హాస్టళ్లు, ప్రైవేటు హాస్టళ్లు కూడా
- 1887 శాంపిళ్లు సేకరిస్తే 95 చోట్ల కల్తీ ఉత్పత్తులని తేల్చిన నివేదిక
- మనుషులకు సురక్షితం కాదని 12 చోట్ల వెల్లడి
- సంబంధిత వ్యాపారస్తులపై క్రిమినల్ కేసులకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ



## కుళ్లిన కూరగాయలు...

### ముంబైలో చెత్తకుప్పలా జెప్టో గోడౌన్

**ఆన్‌లైన్‌లో** ఆహారం, కూరగాయలు, నిత్యావసరాలు ఆర్డర్ చేస్తున్నారా..? అయితే.. మీరు అలా కొనుగోలు చేసినవి నాణ్యమైనవి, శుభ్రమైనవి, స్వచ్ఛమైనవి కాకపోవచ్చు... క్విక్ కామర్స్ సంస్థలు నిమిషాల్లోనే మీ ఇంటి ముందుకు తీసుకొచ్చే సరుకులు స్వచ్ఛమైనవి కాకపోయే ప్రమాదం ఉంది. ఆఫర్లు, తక్కువ ధరలు, క్షణాల్లో ఇంటికే సరకులు వస్తున్నాయని మీరు కొనుగోలు చేసేవి నాణ్యమైనవి కాకపోవచ్చు. మీకు నిమిషాల్లోనే ఇంటికి తీసుకొచ్చే 'జెప్టో' సంస్థ కుళ్లిపోయి బూజు పట్టిన కూరగాయలు, గడువుతీరిన నిత్యావసరాలు, పురుగులు పట్టిన సరకులను సరఫరా చేస్తున్నది. అవును.. ముంబయిలోని ధారావి ప్రాంతంలో ఉన్న జెప్టో గోడౌన్‌లో ఈ విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో జెప్టో బండారం బట్టబయలైంది. అధికారుల తనిఖీల్లో

మిగతా IIవ పేజీలో

> గడువు తీరిన నిత్యావసరాలతో స్టాక్
>
> ముంబైలోని ధారవిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెల్లడి
>
> జెప్టో లైసెన్స్ సస్పెండ్ చేసిన మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్



# బాబా ఆచూకీ ఎక్కడ..?

## ఐదు రోజులు గడిచినా పట్టుకోలేకపోయిన పోలీసులు

> కాంగ్రెస్ కార్పొరేటర్‌ను కాపాడుతున్నదెవరు..?
>
> కేసుపై కమ్ముకుంటున్న నీలినీడలు



సిటీ బ్యూరో, జూన్ 2 : అరాచకాలు, ఆగడాలు, దౌర్జన్యాలతో ప్రజల్ని భయకంపితుల్ని చేసి ఆత్మహత్యలకు కారణమవుతున్న బోరబండ కార్పొరేటర్ బాబా ఆచూకీ పోలీసులకు ఇప్పటికీ లభ్యం కాకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. బీఆర్‌ఎస్ బోరబండ మైనార్టీ డివిజన్ నాయకుడు మహ్మద్ సర్దార్ ఆత్మహత్యకు కారకుడైన బాబాను పోలీసులు పట్టుకోవడంలో జరుగుతున్న జాప్యంపై బాధిత కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. కేసు నమోదై 5 రోజులు గడిచినా అతను ఎక్కడున్నాడో ఇప్పటికీ పోలీసులు కనిపెట్టలేకపోవడంపై విమర్శలకు తావిస్తున్నది.

### కాంగ్రెస్ కార్పొరేటర్ బాబాను కాపాడుతున్నదెవరు..?

దౌర్జన్యాలు.. దాదాగిరి, బెదిరింపులకు పాల్పడే బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌ను ఎవరు కాపాడుతున్నారు? అతని వెనుక ఏ శక్తులు పనిచేస్తున్నాయి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ లోకి ఫిరాయించిన కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఇంకా అరెస్ట్ కాకపోవడంతో అనుమానాలు బలపడ్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నేతల ఒత్తిడితోనే బాబాని అరెస్ట్ చేయకుండా ఖాకీలు జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ బోరబండ మైనారిటీ విభాగం నాయకుడు మహ్మద్ సర్దార్ ఆత్మహత్యకు కారణమైన కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, అతని భార్య హబీబా సుల్తానా, కార్పొరేటర్ పీఏ సప్తగిరి ల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్తున్నారు. ఈ ఐదు రోజులుగా ఈ కేసులో నిందితులు కార్పొరేటర్ బాబా, అతని భార్య హబీబా సుల్తానా, కార్పొరేటర్ పీఏ సప్తగిరిలు ఎక్కడున్నారు? వారికి ఆశ్రయం ఎవరిచ్చారు? నిందితులు ఫోన్లు వాడుతున్నారా? ఒకవేళ వాడితే వారి సెల్ ఫోన్ సిగ్నల్స్ ను ఎందుకు ట్రేస్ చేయలేకపోతున్నారు? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఐదు రోజుల నుంచి పోలీస్ బృందాలు గాలిస్తున్నా..బాబా చిక్కకపోవడానికి కారణమేంటి ? పోలీసులు అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి కేసు దర్యాప్తులో కావాలనే జాప్యం చేస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ కేసులో స్వాధీనం చేసుకున్న సర్దార్ ఫోన్ ను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపారు. కార్పొరేటర్ బాబా బ్లాక్ మెయిలింగ్ కు సంబంధించిన క్లూస్ సేకరించాలని ఫోరెన్సిక్ ల్యాబ్ కు పోలీసులు పంపారు. ఫోరెన్సిక్ నిపుణుల బృందం విశ్లేషించి ఇచ్చే నివేదిక కీలకంగా మారుతుందని పోలీసులు భావిస్తున్నారు.

## గర్భవతుల జీవితంతో చెలగాటమా?

- ప్రసవం కోసం వస్తే.. పని ఉందని వెళ్లిపోతారా?
- వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే తల్లీ బిడ్డలు చనిపోయారు
- 25 లక్షల పరిహారం ఇవ్వకపోతే కుటుంబంతో వచ్చి ధర్నా చేస్తాం
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, జూన్ 2 : బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు రోజుల క్రితం వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తల్లీబిడ్డలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రసవానికి వచ్చిన అరుణ అనే గర్భవతి ప్రసవానంతరం మృతి చెందిన ఘటనలో ... మృతికి గల కారణాలను మేడ్చల్ జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ శోభారాణి, వైద్య సిబ్బందిని మృతురాలి బంధువులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం మాట్లాడుతూ.. గర్భవతికి ప్రసవం చేసి పంపాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రాణాలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన స్టాఫ్ నర్సు తనకు ఇంట్లో పని ఉందని చెప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వెళ్లిపోవడం అత్యంత దారుణమని అన్నారు. స్టాఫ్ నర్సు అక్కడే ఉండి తగిన వైద్య సేవలు అందించి ఉంటే అరుణ మృతి చెంది ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అరుణ మృతికి కారణమైన వారిని సస్పెండ్ చేయాలని కోరారు.

### పరిహారం అందించకపోతే.. ధర్నా


స్టాఫ్ నర్సు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన అరుణ కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం అందించే విధంగా చూడాలని డీఎంహెచ్‌ఓ శోభారాణిని ఎమ్మెల్యే మాధవరం కోరారు. లేనిపక్షంలో బాధిత కుటుంబంతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అదే కేంద్రంలో నెలకు 100కు పైగా ప్రసవాలు జరిగేవని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కిట్లు అందజేసి తల్లీబిడ్డల సంక్షేమానికి ఎంతో కృషి చేశామని తెలిపారు. కూకట్‌పల్లిలో ప్రభుత్వ దవాఖానల విస్తరణ కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్ల విలువైన స్థలాన్ని కేటాయించినా భవన నిర్మాణాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని వెల్లడించారు.



మృతురాలు అరుణ తల్లి లక్ష్మి

### స్టాఫ్ నర్సే పొట్టన పెట్టుకున్నది

తన బిడ్డకు ప్రసవం చేయించి తల్లీ బిడ్డలను సంతోషంగా చూసుకుంటానని భావించి బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి తప్పు చేశానని అరుణ తల్లి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. దవాఖానకు తీసుకురాకుండా ఉంటే తన బిడ్డ బతికి ఉండేదని చెప్పింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం చేసేందుకు స్టాఫ్ నర్సు సరిగ్గా స్పందించలేదని తెలిపింది. వారి నిర్లక్ష్యం వల్లే తన కూతురు, మనవడు తనకు శాశ్వతంగా దూరమయ్యారని కన్నీరుమున్నీరుగా విలపించింది.



బాలానగర్ పీహెచ్‌సీలో డెలివరీ కోసం వచ్చిన అరుణ మృతికి కారణాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు కార్పొరేటర్లు, చిత్రంలో మేడ్చల్ జిల్లా డిప్యూటీ డిఎంహెచ్‌ఓ శోభారాణి



## తెలంగాణ భవన్‌లో...

తెలంగాణ భవన్‌లో రాష్ట్ర అవతరణ దినం సంబురంగా జరిగింది. పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరాగా మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, ఎమ్మెల్యే వివేకానంద్, ఇతర నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, తుల ఉమ తదితరులు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. భవన్ ఆవరణలో జాతీయ జెండా ఎగరవేశారు



## తెలంగాణ సాధకుడికి.. కృతజ్ఞతగా

తెలంగాణ ఆవిర్భావ దినం సందర్భంగా సోమవారం శేరిలింగంపల్లిలోని ఎల్లమ్మబండలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్ రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి జాతీయ పతాకం ఎగురవేశారు. తెలంగాణ సాధకుడైన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రామ స్వామి, జీవన్ రెడ్డి, సమద్, జగదీశ్, రాజు, జనార్దన్ రావు, శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.


- సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ)

పిల్లల చదువులు కొనేదెలా?

## ప్రీ ప్రైమరీకి 2 లక్షలు

- ప్రతి ఏడాదీ పెరిగిపోతున్న ఫీజులు
- లక్షల్లో వసూలు చేస్తున్న ప్రైవేటు బడులు
- నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ దందాలు
- తల్లిదండ్రులపై భారం
- విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ కమిటీల ఆగ్రహం

"అది హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్. ఎల్‌కేజీలో తన కూతురిని చేర్పించడానికి ప్రకాశ్ అనే తండ్రి వెళ్లాడు. ఫీజు 95వేలు అంటూ యాజమాన్యం చెప్పింది. ఎల్‌కేజీకి అంత ఫీజు ఎందుకు ఉంటుందని అడిగితే.. మా స్కూల్‌లో ఫీజులు అంతే ఉంటాయి. మీకిష్టముంటే చేర్పించండి. మా స్కూల్లో అడ్మిషన్ల కోసం పోటీపడుతారు." స్కూల్ యాజమాన్యం అలా చెప్పడంతో అవాక్కవడం ఆ తండ్రి వంతైంది. ఫీజుల ప్రక్రియలో ఓ విధానం లేకపోవడంతో ఆ తండ్రి ఏం చేయాలో తెలియక ఇంటికొచ్చేశాడు.



**సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ) :** మరో పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. తల్లిదండ్రులకు పాఠశాలల నుంచి ఫోన్లు వస్తున్నాయి. "మీ పిల్లల ఫీజులు చెల్లించండి..యూనిఫాం, బుక్స్ వచ్చాయి. యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవాలి. డబ్బులు చెల్లించి వాటిని తీసుకొండి.' అంటూ చెబుతున్నారు. అంతేకాదు ఫస్ట్ టర్మ్ ఫీజు స్కూల్ ప్రారంభం రోజునే చెల్లించాలని షరతులు విధిస్తున్నారు. ఇక గతంలో ఫీజు బకాయిలు ఉన్న పేరెంట్స్‌కు మరో స్కూల్ చూసుకోండి అంటూ బెదిరిస్తున్నారు. చదువులు చెప్పే పాఠశాలలు ఇప్పుడు డబ్బులు వసూలు చేసే వ్యాపార కేంద్రాలుగా మారాయంటూ విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే తరగతి చదు

మిగతా IIవ పేజీలో

## రేషన్ కోసం.. గంటల కొద్దీ క్యూలు

- ఒక్కో ఎంట్రీకి 15 నిమిషాలు
- ఒక్కో లబ్ధిదారునితో 3 సార్లు వేలిముద్రలు
- గంటకు నలుగురికి మాత్రమే సరఫరా
- కొత్త సాఫ్ట్‌వేర్‌తో తప్పని ఇక్కట్లు
- తిప్పలు పడుతున్న కార్డు దారులు

అబిడ్స్, జూన్ 2: నగరవ్యాప్తంగా రేషన్ దుకాణాల ముందు చేంతాడంత క్యూలు కనబడుతున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి సరుకులు అందించేందుకు 15 నిమిషాల సమయం అవసరమవుతున్నది. గంటకు నలుగురైదుగరికంటే ఎక్కువ మందికి సరుకులు అందించలేకపోతున్నారు. దీంతో అటు రేషన్ డీలర్లు, ఇటు రేషన్ లబ్ధిదారుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికంతటికీ కారణం కొత్త సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టడమేనని తెలుస్తున్నది. వర్షాకాలం నేపథ్యంలో ఆహార భద్రత కార్డులకు జూన్ మాసంలో మూడు నెలల

మిగతా IIవ పేజీలో



అడ్డగుట్టలో సోమవారం ఓ రేషన్ దుకాణం ముందు సరుకుల కోసం బారులు తీరిన స్థానికులు